# రామి తెచ్చిన రభస



వరి నాటువేసే కూలిపిల్ల రామి కన్ను గిలిపిందంటాడు రైతు వెంకయ్య—

'ఆయనే సైగజేసిండు' అంటుంది రామి!

అసలీ రహస్యం బైటికెట్లా వచ్చింది!?—

రామి మరదలుపిల్ల వాళ్ళన్నయ్యతో చెప్పింది ఈ కథంతా పసిగట్టి!

'నాకీ పెళ్ళాం వద్దు. ఇయ్యాల గాకపోతే రేపైనా ఇది ఇట్లాగే గొంప దీత్తది!' అని కులం పెద్దల్ని పిలిచి పంచాయితీ పెట్టాడు వీరడు!

కులం పెద్దలికి ఎటు చెప్పటానికీ ఏమీ తోచిందిగాదు. 'ఈసారికి సర్దుకోవాల నీవే!' అన్నారు వీరణ్ణే! వాడు ససేమిరా అన్నాడు! ఊళ్లో పెద్దల్లో పంచాయితీ పెట్టారు. గూడెం అంతా కదిలి వెళ్లి! - పెద్దలికీ ఏమీ తోచింది గాదు! వెంకయ్య కాస్త సంపన్న రైతు - పెద్దలు నీళ్ళు నములుతూ 'వెంకయ్య మంచి రైతు. ఇట్లాంటి అలవాట్లు కలవాడుగాదు. అందులోనూ మీ కులందే కావాల్సొచ్చిందా ఆయనకు! ఇదా కొత్తగా కాపరానికి వచ్చిన పిల్ల. దానికేమీ తెలియదు. తెలియక ఏమనుకుందో - ఎవర్ని చూసి ఎవరనుకుందో! పోండి ఇళ్ళకు, ఇల్లాంటి వెధవ తగాదాలు లేక!' అని కసిరారు. అంతా ఇళ్లకు వెళ్ళారు. పెద్దలూ పెద్దలూ ఒకటే. మన కెవరు న్యాయం చెప్పాళ్ళు! అనుకుంటూ.

వీరడు మట్టుకు దాన్ని గడప తొక్కనియ్యనని గుమ్మంలో కర్రపట్టుకు కూచున్నాడు!

కులం పెద్దలకి పంచాయితీలో ఏమీ గొంతు కడి అయ్యేది లేదు! గాని గూడెమంతా ఉడికిపోతున్నది! ఎక్కడ విన్నా ఇవే కబుర్లు. ప్రతీ వాళ్లూ ఏదో పనున్నట్టుగా వెడుతూనో - ప్రతీ వాళ్లూ తాము అలక్ష్యం చేస్తోన్నట్టు ఇతరులను కొనేలా నటిస్తూనో వింటూనే వున్నారు. ఏదో అంటూనే వున్నారు! అసలిట్లాంటి వ్యవహారమంటే అందరికీ సరదాయే! తమను వదిలేసి అందర్నీ కలయజూస్తారు లోకులు! పరమానందయ్య శిష్యులు లోకులసలు!

ఈ గోల ఇట్లా తగ్గదని తెగించి ఎల్లాగైతేనేమి ఊళ్లో రైతుల్లోనే ఈ పంచాయితీని పెట్టారు గూడెం పెద్దలూ, వీరడూనూ! -

వెంకయ్యా వచ్చాడు పంచాయితీకి!

రైతులకూ ఏమీ తోచిందిగాదు ఎటు చెప్పటానికీ!

వెంకయ్యకు రోషమూ - భయమూ పెనవేసుకుని గుండె అంతా మంట బుట్టింది! - వెంకయ్య పూర్వకాలం రైతులవలె కావి పంచలూ, కిర్రు చెప్పులూ ధరిస్తూ - క్రాఫింగూ, చొక్కా లేకుండా ఉండే రకం మనిషిగాదు. విద్యాధికుడు గాకున్నా విద్యావంతుడనే పేరు ఆ వూళ్లో.

ఎవరూ ఏమీ అడక్కుండానే వెంకయ్య లేచి నుంచుని కోపం గక్కుతూ ఏవో ఏవో మాటలు పెద్దగా కేకలేసివేసి, 'రామే నన్ను

బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

జూచి కండ్లుగిలించింది. ఎందుకని ఊరుకున్నా. వెధవలు.' అంటూ కళ్ళమీద పడే క్రాపును పైకి నెట్టటానికి తలపైకి విసిరాడు! రామిని పిలిచారు.

'వెంకయ్య ఏమన్నాడో చెప్పు' మన్నారు.

'ఆరు నన్నేమన్లేదండి. ఇట్టా ఎగరేసినట్టే నన్ను జూసి తల ఎగరేసిర్రండీ!' అంటూనే, అవకముందునుంచే నవ్వులు చిలుకుతూన ఉంది! కళ్ళు రెండూ గవ్వన కొట్టింది!

అసలు కథంతా అర్థమైంది రైతులకు!
నిజం చెబితే వింటుందా లోకం?

'ఇహ పంచాయితీ చెబుతున్నాం వినండి!' అన్నారు గూడెం పెద్దల్తో రైతులు-'వెంకయ్య మా మాదిరి మోటరైతు కాడు- దక్షిణాదివాడు- ఇది మీకు తెల్సిందే గదా! చాలా పెద్దమనిషి. ఇదీ మీకు తెలుసు!'

'అయ్యా తెల్సునండీ!'

'చెబుతాం వినండిరా- పోతే, ఆయనకు-' అంటూనే వెంకయ్యను చూస్తూ, 'ఆయనకు ముందరి జుట్టుంది గదా, అది కళ్ళమీద పడుతోంటే తల పైకెగరేసే అలవాటుంది! పెద్ద క్రాఫింగులు గలవాళ్ళకు చాలామందికి ఆ అలవాటుంటుంది! అదీగాక ఇప్పుడదో నాగరీకం గూడాను! సరే. అది అదీ!- ఇక మీ రామి మాట. అది కొత్తకోడలం మీకు తెల్సు గదా!?'

'సిత్తం తెల్సునండీ!'

'వినండిరా బాబూ వినండి! మీరు ఏమీ తెలియనట్టుంటారు అన్నీ తెల్సు మీకు!!'

'మాకేమీ తెలీదండీ! వొట్టి యెడ్డోళ్ళం అన్నీ తమకే యెరికె!!'

'సరే. మీ రామిమాట: కొత్తగా కాపరానికి వచ్చినవాళ్లు చాలామంది ఎప్పుడూ, ప్రతి మాటకూ నవ్వుతూంటారు! అదిగాక దీనికి కళ్ళార్చే అలవాటొకటుంది! ఇప్పుడు మీరంతా చూస్తూనే వున్నారు గదా! ఇంతమందిలో దాన్ని ఒక్కమాటడిగితే ఆ నవ్వటం, ఆ కళ్ళార్పటమూనూ!...'

'అయ్యా చూశామండీ!'

'చూశారు గదా! ఇప్పుడెవర్ని చూసి కన్ను గీటింది చెప్పండి!!- ఇదీ గూడా ఒక షోకే అనుకుని అంటూంటారు కొందరిట్లాగే! పోతే: ఇదేమీ ఒకర్నొకరనుకుంది గాదు. ఇంతా చేస్తే వడ్లగింజలోది ఏమిట్రా!?...'

'బియ్యపు గింజండీ!'

'మంచి తెలివైనవాళ్ళు. ఎవర్రా ఈ తగాదా పెట్టిన వెధవలు! పొద్దుబోక! ఆయన్ని నిష్కారణంగా బైటపడేస్తిరి! దాన్ని బజారులోకి లాగితిరి!! ఏంపన్లు?'

'అయ్యా మా చేతప్పైందండీ, మా యీరిగాడు వొట్టి మకురునండీ!! చెబితే యినడు. నానాగల్లంతూ చేసిండు. పోనీ లేరా పెద్ద కాపులు అట్టా సెయ్యనే సెయ్యరు. సేసినా మనం లేనోళ్లం. ఇంతపట్టింపు చేస్తే ఎట్టరా! అంటూనే ఉండమయ్యా!'

'ఛీ. అదేంమాట. పెద్దయితే పెత్తనంగా ఉండమన్నారు గాని, ఇట్టా చెస్తే మేమొప్పుకుంటామేమిట్రా! ఎవరు చేసినా తప్పు తప్పే! పోండి కొంపలకు!!'

గూడెంవాళ్ళు గూడెం వెళ్లారు.

అక్కడ కులం పెద్దలు కులం పంచాయితీ పెట్టి ఇట్టా దాన్నెత్తిన అబద్ధాలేసి మమ్మల్నందర్నీ నానాబాధా పెట్టినందుగ్గాను పది రూపాయలు తప్పెత్తున్నామని వీరడికి తప్పేసి వీరణ్ణి విముక్తి చేశారు.

ఈ హంపారులో వీరడూ, రామీ- చిన్ని చిలిపికయ్యం పెట్టుకుని ఇంట్లో దీపం ఆర్పి తలుపు బిగించేసుకున్నారు.

